క్లుప్తంగా

పరామర్శ



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చిన్నయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా చిన్నయ్య దశ దిన కార్యక్రమానికి మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు హాజరై బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. చిన్నయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



నర్సింహారెడ్డి (ఫైల్)

రేగొండ: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ ఎడెల్లి నర్సింహారెడ్డి (94) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఆయన రేగొండ సర్పంచ్‌గా మెరుగైన సేవలు అందించారు. నర్సింహారెడ్డికి భార్య కౌసమ్మ, నలుగు రు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై భూపాలపల్లి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు మోడెం ఉమేశ్ గౌడ్, పున్నం రవి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతున్న ఒకరి మృతి

మొగుళ్లపల్లి: పురుగు మందు తాగి చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని ముల్కలపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ముల్కలపల్లికి చెందిన అశాడపు ఐలుమల్లు (70) గత కొంత కాలంగా షుగర్‌వ్యాధితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఎడమకాలుకు గాయం కావడంతో సర్జరీ చేసి కాలు తీసివేశారు. దీతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఐలుమల్లు కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఆర్థిక సాయం

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సి) గ్రామానికి చెందిన కట్ల కుమార్ తండ్రి సమ్మయ్య (62)ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి చెందిన కుమార్‌కు తోటి మిత్రులు దామెర ఎస్సై కొంక అశోక్ రూ.5వేలతోపాటు 50 కిలోల బియ్యం అందించగా మిత్రులు జెట్టి కుమార్, ఉప్పుల కిరణ్, చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా.. చిట్యాల మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సి) గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా.. సీఐ గన్‌మేన్ పులి అశోక్ గౌడ్ 50కిలోల బియ్యం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాటారం: మండలంలోని కొత్తపల్లి సమీపంలో జాతీయ రహదారి 353(సి)పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి గ్రామానికి చెందిన తోటపల్లి రాజేశ్ జాతీయ రహదారిని ఆనుకొని బైక్‌ను నిలిపి ఉన్నాడు. వరంగల్ నుంచి కాళేశ్వరం వెళ్తున్న టూరిస్టు బస్సు ఆగి వున్న బైక్‌ను వేగంగా ఢీ కొట్టింది. దీంతో బస్సు ముందు భాగం, బైక్ ధ్వంసమయ్యాయి. రాజేశ్ కాలుకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో రాజేశ్‌ను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అప్రమత్తంగా ఉండండి

గోవిందరావుపేట: రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉందని వాతావరణ శాఖ సూచించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి గనపాక సుధాకర్ సూచించారు. బుధవారం ఆయన చల్వాయి గ్రామంలో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వెల్పుగొండ ప్రకాశ్, కాసర్ల రాంబాబు, పెద్దపురం మొగిళి, బొనగాని సారయ్య, వెంకన్న, వచ్చవాయి సారయ్య, రమేశ్, వికాస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మన ఉత్తమ గురువులు..

● జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరం ప్రభుత్వం ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈ ఏడాది జిల్లా నుంచి ముగ్గురు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. తాము విద్యార్థుల ఎదుగుదల, అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తించి అవార్డు ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈసందర్భంగా వారిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు అభినందించి శుభాకాంక్షలు చెబుతున్నారు.

జాతీయ, రాష్ట్రస్థాయిలో మా విద్యార్థులు



విద్యార్థులు సాధించిన అవార్డులతో పీడీ రాజయ్య

భూపాలపల్లి అర్బన్: నేను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్నానంటున్నారు.. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన పీడీ రాజయ్య. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి జాతీయ స్థాయికి 45 మంది విద్యార్థులు, రాష్ట్ర స్థాయికి 162 మంది విద్యార్థులను వివిధ క్రీడల్లో పాల్గొనేందుకు తీసుకెళ్లినట్లు ఈసందర్భంగా తెలిపారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

ఇంగ్లిష్‌లో వందశాతం ఉత్తీర్ణత



భూపాలపల్లి అర్బన్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అమరేందర్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన నాటి నుంచి గత పదేళ్లుగా 10వ తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఇంగ్లిష్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నట్లు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత నాతాడు అమరేందర్‌రెడ్డి తెలిపారు. భూపాలపల్లి మండలంలోని కొంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు మొత్తం వంద శాతం రిజల్ట్ సాధిండంలో ప్రధాన పాత్రపోషించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం గర్వంగా ఉందంటున్నారు.. ఉపాధ్యాయుడు అమరేందర్‌రెడ్డి.

గురుకుల విభాగంలో.. రజనీకాంత్



రజనీకాంత్

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల అప్‌గ్రేడ్ కళాశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆడెపు రజనీకాంత్ గురుకులం విభాగంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. గత విద్యాసంవత్సరంలో విద్యార్థులు వివిధ డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలలో పాల్గొని రాష్ట్ర, జిల్లా స్థాయి బహుమతులు పొందడంలో రజనీకాంత్ ఎంతో కృషి చేశారు. మైక్రో ఆర్ట్, ట్రైబల్ ఆర్ట్‌లో విద్యార్థుల ఉన్నతికి కృషి చేయడంతోపాటు జాతీయస్థాయిలో రేడ్ ఇండియా సెలెబ్రేషన్స్‌లో ప్రతి సంవత్సరం పది మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చేలా ఆయన ప్రోత్సహిస్తున్నారు. గురుకులంలో విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీస్తున్న రజనీకాంత్ కృషిని గుర్తించిన గురుకులం అధికారులు రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక చేశారు.

నీట మునిగిన పంటలు



చెరువును తలపిస్తున్న వరి పంట



బ్రిడ్జి వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

రేగొండ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలు బుధవారం తడిసిముద్దయ్యాయి. జిల్లాలోనే అత్యధికంగా రేగొండలో 30.8 సెం.మీ, కొత్తపల్లిగోరిలో 30 సెం.మీ వర్షపాతం నమోదైంది. మండలంలోని రేపాక చెరువు, మడతపల్లి పెద్ద చెరువు మత్తళ్లు దూకాయి. పలు గ్రామాల్లో వరి, పత్తి, మిరప పంటలు నీట మునిగాయి. కొత్తపల్లిగోరి మండలంలోని జమ్‌షేడ్ బేగ్‌పేటలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకు పోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సుదర్శన్

కాటారం: పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పూర్తి వివరాలు యూ డైస్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని ఎంఐఎస్ మండల కోఆర్డినేటర్ గద్దల సుదర్శన్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల విద్యాధికారి దేవనాయక్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని దామెరకుంట సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. స్కూల్‌లో ఉన్న విద్యార్థులు, వారి వివరాలు, ఫిజికల్ ఫెసిలిటీస్ వివరాలు అన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల వివరాలు సైతం నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మానస, రెండో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీవిద్య ఉన్నారు.

మహాధర్నాలో చెల్పూరు ఉద్యోగులు



ఆందోళన చేస్తున్న కేటీపీపీ ఉద్యోగులు

గణపురం: మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలోని బీసీ, ఓసీ ఉద్యోగులు బుధవారం విద్యుత్ సౌధ ముట్టడి (మహా ధర్నాలో) భాగంగా బుధవారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 2024 జూన్ 2 ప్రకారం నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు అన్ని ప్రమోషన్స్‌ను వర్తింపజేయాలని సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రకారం నేరుగా నియమించబడ్డ ఉద్యోగులకు మెరిట్ ఆధారంగా సీనియారిటీని ప్రకటించాలనే పలు డిమాండ్లతో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నవారిలో నాయకులు అశోక్, బాలబ్రహ్మచారి, ఫతేకుమార్, సతీశ్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కేటీకే 5వ గనిలో వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని గనుల మేనేజర్లకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బొగ్గు గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీఎంఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఏరియాలో కార్మికులు ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు మల్లేశ్, సుజేందర్, నారాయణ, రాజ్‌కుమార్, రవి, స్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోర్లవీడు రామాలయం నూతన కమిటీ ఎన్నిక



రామాలయంనూతన కమిటీ సభ్యులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని గోర్లవీడు దాశరథి రామాలయం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు నూతన కమిటీ చైర్మన్ నలిమెల సదయ్య తెలిపారు. బుధవారం రామాలయం ఆవరణలో యువజన సంఘాలు, గ్రామ ప్రజల సమక్షంలో ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా చాట్లపెల్లి రవి కుమార్, ప్రధాన కార్యదర్శిగా మోతె రమేశ్, సహాయ కార్యదర్శిగా పెండెల కుమార్, ప్రచార కార్యదర్శిగా రావుల శంకర్, కోశాధికారిగా రంగు రవీందర్, సలహాదారులతోపాటు కార్యవర్గ సభ్యులు, మహిళా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎకరానికి రూ.25వేల పరిహారం ఇవ్వాలి

● భూక్య జంపన్న



పాపయ్యపల్లిలో వరిని పరిశీలిస్తున్న నాయకులు

గోవిందరావుపేట: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు తీవ్రంగా నష్ట పోయారని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.25,000 నష్ట పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు భూక్య జంపన్న అన్నారు. మండల పరిధిలోని పస్రా, గాంధీనగర్, బాలాజీ నగర్, చంద్రుతండా, పాపయ్యపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా జంపన్న మాట్లాడుతూ రైతులు నాటు వేసి 40రోజులు అవుతుందని, ప్రతి రైతు ఇప్పటి వరకు ఒక ఎకరానికి రూ.25,000 పెట్టుబడి పెట్టాడని తెలిపారు. వర్షాల వల్ల కాలువలకు గండ్లు పడి పొలాల్లో ఇసుకు మేటలు వేసిందన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహానాయక్, పోరిక స్వామి, అజ్మీరా నరసింహ, రాజు, అనిల్, సుమన్, శ్రీను, విక్రమ్, శ్రీను రెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

● కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి



మహదేవపూర్‌లో మట్లాడుతున్న డీఎస్పీ, సీఐ

కాళేశ్వరం: వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రామచంద్రరావు, ఎస్సై పవన్‌కుమార్‌లతో కలిసి పలు కమిటీల సభ్యులతో మాట్లాడారు. శాంతియుతంగా, భద్రత వాతావరణంలో వినాయక చవితి, నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. సంబంధిత వెబ్ సైట్‌లో విగ్రహం ఎత్తు, నిమజ్జనం చేయు సమయం, తేదీ, ప్రదేశం, ఇతర వివరాలతో సంబంధిత వెబ్ సైట్‌లో పొందుపరచాలన్నారు. నిరంతరం విగ్రహం మండపం వద్ద ఇద్దరు పెద్దలు అందుబాటులో ఉండాలని, రాత్రిపూట విగ్రహం దగ్గర కచ్చితంగా ఇద్దరు లేదా ముగ్గురు నిద్రించాలని తెలిపారు. డీజేలకు పర్మిషన్ లేదని, మైకులు, బ్యాండులు పెట్టదల్చుకుంటే అనుమతి తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున మండపానికి కరెంటు కనెక్షన్ ఇచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. రాత్రి సమయంలో పెద్ద సౌండ్‌లు పెట్టొద్దని, ఎటువంటి చిన్న సమస్య తలెత్తిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఇదిలా ఉండగా.. కాళేశ్వరం పోలీసు స్టేషన్‌లో ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలపై సమావేశం ఏర్పాటు చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు (గురువారం) భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు లబ్ధిదారులు రైతువేదిక వద్దకు రావాలని సూచించారు.

పోషణ మాసోత్సవాలు

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పోషణ మాసోత్సవాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల బరువును తీసుకున్నారు. బరువు తక్కువ గల పిల్లల వివరాలను నమోదు చేసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం లభిస్తుందని, కావున ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ -2 టీచర్ శ్రీదేవి, హెల్పర్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, బాలింతలు పాల్గొన్నారు.

పంటరుణాలను వినియోగించుకోవాలి

భూపాలపల్లి రూరల్: జంగేడు పరిధిలో పీఏసీఎస్ పరిధిలోని 1, 2, 3 విడతల్లో రుణాలు మాఫీ అయిన రైతులు ఈనెల 8వతేదీ వరకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పంటరుణాలు(క్రాప్‌లోన్)లు తీసుకోవాలని తెలిపారు. లేనిచో రుణాలను రద్దు చేయడం జరుగుతుందని జంగేడు పీఏఈసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.

రహదారులను పునరుద్ధరించాలి

టేకుమట్ల: రైతుల పంట పొలాలకు వెళ్లే దారులను పునరుద్ధరించాలని కోరుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ బుధవారం వినతి పత్రాన్ని అందించారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు దారి సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సామాజిక వైద్య శాఖ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆస్పత్రిలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న నారాయణరెడ్డి

కాటారం: మహాముత్తారం మండలం నల్లగుంట మీనాజీపేటకు చెందిన మాజీ సర్పంచ్ ముత్యాల రాజుతోపాటు పలువురు బుధవారం బీజేపీ పార్టీలో చేరారు. కాటారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కేంద్రంలో బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. నూతనంగా పార్టీలో చేరిన వారిలో ఐలయ్య, సమ్మయ్య, రఘు, నర్సింహారెడ్డి, చందు, అరవింద్, స్వామి ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి పిలుమర్రి సంపత్, మహాముత్తారం మండల ఇంచార్జి దుర్గం తిరుపతి, బీజేవైఎం నాయకులు బండ శ్రీకాంత్, గుగులోత్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

వెంకటపురం(కె): గ్రామాల్లో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి కోరారు. బుధవారం ఆయన సీపీఎం కార్యాలయంలో మండల వంక రాములు అధ్యక్షతన నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. వెంటనే వైద్య సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాట చేయాలని సూచించారు. మండలంలో గత కొంతకాలం నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రోడ్లు పూర్తిగా పాడయ్యాయని అధికారులు చొరవతీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు సాంబశివ, వాసు, కుమ్మరి శ్రీను, సత్యం, ఆదినారాయణ, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'పశువులకాపరులు అడవికి వెళ్లొద్దు'

ములుగు: భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగుతున్న నేపథ్యంలో పశువులకాపరులు అడవుల్లోకి వెళ్లకూడదని ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎట్టి పరిస్థితిలో వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని తెలిపారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు ఇళ్ల గోడలు పూర్తిగా నాని విద్యుత్ ప్రమాదం జరగడానికి ఆస్కారం ఉందని, వర్షాలు తగ్గుముఖం పట్టి ఇంటి గోడలు ఆరేంతవరకు విద్యుత్ పనులు చేయొద్దని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని తెలిపారు. వాతావరణ శాఖ ములుగు జిల్లాను ఎల్లో అలెర్ట్‌గా ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

బుస్సాపూర్‌లో ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

గోవిందరావుపేట: మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై ఇంటింటికి తిరుగుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ కిషన్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ హెచ్‌ఐవీ ఎయిడ్స్ మీద అవగాహన ఉండాలని అన్నారు. హెచ్‌ఐవీ నాలుగు మార్గాల ద్వారా వస్తుందని వివరించారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే



వాజేడు: రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



వాజేడు: మురుగు నీటి గుంతలో టీమోపాస్ చల్లుతున్న వైద్య సిబ్బంది

వాజేడు: వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొల్లార, ఆరుగుంట పల్లి గ్రామాల్లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జ్వరాల తీవ్రతపై ఇంటింటి సర్వే నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి అప్పయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ భవ్యశ్రీ ఆదేశాల మేరకు ఈ సర్వేను నిర్వహించారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఇంటి పరిసరాల్లోని పాత వస్తువులు, టైర్లల్లో ఉన్న నీటిని పారబోశారు. నిలువ నీటిని తొలగించారు. జ్వరం వస్తే తప్పని సరిగా ప్రభుత్వ వైద్య శాలకు రావాలని సూచించారు. మురుగు నీటి గుంతల్లో టీమోపాస్ మందును చల్లారు. రెండు గ్రామాల్లో వైద్యులు మహేందర్, గ్యానస రోగులను పరీక్షించి మందులను అందించారు. ఈ కార్య క్రమంలో కోటిరెడ్డి, శేఖర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం

వెంకటపురం(కె):సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని రామచంద్రపురంలో డాక్టర్ భవ్యశ్రీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో సిబ్బందితో ఇంటింటి ఫివర్ సర్వే నిర్వహించి ఫివర్‌తో ఉన్నవారికి గుర్తించి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో డ్రై డే నిర్వహించారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి వెక్టర్ జనన ఆశాలు పాల్గొన్నారు.

అప్రమత్తమైన అధికారులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాజేడు: గోదావరి వరద ఉధృతంగా పెరుగుతుండటంతో జిల్లా, మండల అధికారులు అప్రమత్తమయ్యారు. పలు చోట్ల రహదారుపైకి వరద నీరు చేరడంతో అటు వైపుగా ప్రజలు వెళ్ల కుండా రహదారులకు అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మండల పోలీసులను అప్రమత్తం చేశారు. పేరూరు, వాజేడు ఎస్సైలు కృష్ణ ప్రసాద్, హరీశ్ తమ సిబ్బందితో రహదారుపైకి వరద నీరు చేరిన ప్రదేశానికి వెళ్లి హెచ్చరిక చేయడంతోపాటు బారీ కేడ్లను అమర్చారు. మండల ప్రత్యేకాధికారి సర్దారింగ్, ఎంపీడీఓ విజయ, పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ టేకుల గూడెంకు వెళ్లి ప్రజలకు పలు సూచనలను చేశారు.